# గణతంత్ర వేడుకపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

- ప్రతి నెలా తెలంగాణలో మోడీ, అమిత్‌షా, నడ్డా పర్యటిస్తారు
- బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపి డా.లక్ష్మణ్



**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** తెలంగాణలో బిజెపి మరింత బలోపేతం చేసేందుకు దృష్టి సారించిందని, అందులో భాగంగానే ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఇక నుంచి ప్రతి నెల ఒకసారి తెలంగాణలో పర్యటిస్తారని పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపి డా.లక్ష్మణ్ తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పెరేడ్‌తో గణతంత్ర దినోత్సవం నిర్వహించాలని హైకోర్టు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని, న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతి స్తున్నామన్నారు. సిఎం కెసిఆర్ ఇప్పటికైనా బేషజాలకు పోకుండా ఉండాలని, సద్బుద్ధి రావా లని కోరుతునానన్నారు. కరోనా ఉందని సాకు చెప్పడం సరికాదన్నారు. మీ పార్టీ సభలకు లేని కోడ్ గణతంత్ర దినోత్సవానికి పెట్టడం సరికాదన్నారు. దేశం గర్వించదగిని వేడుకకి తుచ్ఛమైన రాజకీయాలు ఆపాదించడం దారుణం అన్నారు. మీది రాజరికం, పెత్తందారి విధానం, గడీల పాలన అన్నారు. ప్రతి సంప్రదాయం కోర్టు ద్వారానే కాపాడటం చాలా కష్టం అన్నారు. ప్రభుత్వం రాజ్‌భవన్‌లో నిర్వహించాలని నిర్ణయం తీసుకుందన్నారు. కేబినెట్ ఎప్పుడు జరిగింది, నిర్ణయం ఎక్కడ తీసుకున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం అంటే కెసిఆర్ ఒక్కడేనా అంటూ ప్రశ్నించారు. రాజ్యాంగ వ్యవస్థ అనేది ఒకటి ఉంటుందని, దానికి విధానాలు ఉంటాయన్నారు. రాజ్యాంగం వచ్చిన నుంచి పెరేడ్ ఉందన్నారు. స్కూల్ పిల్లలకు కూడా పెరేడ్ సంస్కృతి, విధానం లేకుండా చేయడం ఏమిటన్నారు. మాట్లాడితే రాజ్యాంగాన్ని మారుస్తాం అంటారు. విలువలు పాటించని కెసిఆర్ మద్దతు ఇస్తారా అన్నారు. సవరణ కాదు రాజ్యాంగమే మారుస్తా అన్న కెసిఆర్‌ను సమర్థించడం కేవలం ఓట్లు, సీట్ల కోసమేనా అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో కెసిఆర్ ఓటమే లక్ష్యంగా బిజెపి గెలుపే ధ్యేయంగా పోరాటం చేయాలని బిజెపి నిర్ణయం తీసుకుందన్నారు. 11000 గ్రామాల కూడళ్లలో సమావేశాలు పెట్టి కెసిఆర్ మోసాలు నప్రజల వద్ద ఎండగడతామన్నారు. 27న జరిగే పరీక్షా పే చర్చ తెలంగాణలోని ప్రతీ అసెంబ్లీలో ఐదు పాఠశాలలో మోడి ప్రసంగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. పల్లెగోస బిజెపి భరోసా పేరుతో ప్రజల్లోకి విస్తృత పర్యటనలు ఉన్నా యన్నారు. పార్లమెంటరీ ప్రవాస యోజన మరింత ఉధృతంగా ఉంటుందన్నారు.

## గణతంత్ర దినోత్సవాన్ని నాలుగు గోడల మధ్య నిర్వహించాలనుకుంటున్నారా?

### మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను నాలుగుగోడల మధ్యే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి కుట్ర చేస్తున్నారని బిజెపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాంచందర్‌రావు అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ నియంతలా వ్యవరిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. కోర్టులు మెట్టికాయలు వేస్తే కెసిఆర్ వినే పరిస్థితి లేకపోవడం దురదృష్టకరం అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ భావాలను ప్రజల్లో నింపే ఉద్దేవ్యంతో అత్యంత పరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పరేడ్ ద్వారా సైనికుల, పోలీసుల ధైర్యసాహసాలు ప్రజలు తెలుసుకునే అవకాశముందన్నారు. అదేవిధంగా వివిద సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా వివిధ కళారూపాలు, విద్యార్థులు, నైపుణ్య ప్రదర్శనలు ఈ వేడుకల్లో ప్రతిబిబిస్తాయన్నారు. ఎంతో విశిష్టత కలిగిన ఈ వేడకలను రాజ్ భవన్‌కే పరిమితం చేయాలని కెసిఆర్ నిర్ణయించడం సిగ్గుచేటు అన్నారు.



## భారీగా ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆదాయం

### సిఎండి ప్రదీప్

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త :** ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆదాయం భారీగా పెరిగిందని ఆ సంస్థ సిఎండి కెవి ప్రదీప్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికానికి ఆదాయం గత ఏడాది ఇదే సమాయంతో బేరీజు వేసుకుంటే 141 శాతం పెరిగి 766 కోట్ల రూపాయలకు చేరుకుందని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుత త్రైమాసికంలో 142 కరెంటు బస్సులను సరఫరా చేయడంతో ఈ వృద్ధి సాధ్యమైందన్నారు. 2021 డిసెంబరు 31 నాటికి 18.2 కోట్ల రూపాయల నికర లాభం రాగా, గత డిసెంబరు నాటికి 42.9 కోట్ల రూపాయల లాభం నమోదు చేసిందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఈవీ మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ తమ సంస్థ స్థిరమైన రాబడి సాధించిందన్నారు. బలమైన వ్యాపార తీరు వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. 2022-23 త్రైమాసికంలో కరెంటు బస్సుల ఆర్డరు 3,220 వద్ద ఉండగా, 103 డెలివరీ చేశామని, ఈ త్రైమాసికంలో 142 పంపిణీ చేశామన్నారు. నాగపూర్, సిల్వస్సా, సూరత్, డెహ్రాడూన్‌లకు పూర్తి స్థాయిలో బస్సులు డెలివరీ చేశామని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రా ఆర్టీసీలకు బస్సుల సరఫరాపై దృష్టి సారించామని తెలిపారు.

## అంగన్‌వాడీల్లో న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాల సమాచారాన్ని ఏ రోజుకారోజు తెలుసుకునేందుకు న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ విధానం పేరిట ప్రత్యేక యాప్‌ను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రవేశపెట్టింది. ఇప్పటికే అంగన్వాడీ కార్యకర్తలందరికీ స్మార్ట్ ఫోన్‌లను పంపిణీ చేసిన నేపథ్యంలో ఈ యాప్‌ను విధిగా వారంతా డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఈ యాప్ ద్వారా ప్రతీ రోజూ తమ తమ హాజరుతో పాటు, అంగన్వాడీ కేంద్రాలకు ఎంత మంది పిల్లలు హాజరయ్యారు, వారికి ఎంత మేరకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారన్న వివరాలను ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే తమ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు కూడా పంపిణీ చేసిన పౌష్టికాహార వివరాలను నమోదు చేయడం తప్పనిసరి. ఇందువల్ల అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న స్టాకు వివరాలు ఎప్పటికప్పుడు సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్టుతో పాటు, రాష్ట్ర స్థాయి అధికారులు తెలుసుకునే వీలుంటుంది.



## సాయుధ దళాలకు ఎస్‌బిఐ రూ.33.78 లక్షల విరాళం

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త :** సాయుధ దళాల పతాక దినోత్సవానికి ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ 33,78,200 రూపాయలను విరాళంగా ఇచ్చింది. సర్కిల్ పరిధిలోని ఉద్యోగులు ఈ మొత్తాన్ని సమకూర్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో వీటి వివరాలను వెల్లడించారు. సైనిక్ వెల్ఫేర్ డైరక్టర్ కల్నల్ రమేష్‌కుమార్ సమక్షంలో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్ చైర్‌పర్సన్ అయిన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ఎస్‌బిఐ సర్కిల్ సిజిఎం అమిత్ ఝింగ్రాన్ ఈ మొత్తానికి చెక్కును అందించారు.

ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ ఇది గొప్ప ఉద్దేశ్యమని, ఇతరులు అనుకరించేందుకు ప్రేరేపిస్తుందన్నారు. యుద్ధ వీరులు, మాజీ సైనికులు, మరణించిన సైనికుల వితంతువులు, వారిపై ఆధారపడిన వారి సంక్షేమానికి మద్దతుగా విలువైన సహకారాన్ని అందిం చడం పట్ల అభినందించారు. రక్షణ సిబ్బందికి మద్దతు ఇవ్వడంలో తాము ముందున్నామని జింగ్రాన్ తెలిపారు.

## 14 మంది రాష్ట్ర పోలీసులకు పతకాలు

### ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్‌కుమార్‌కు పిపిఎం, సీనియర్ ఐపిఎస్‌లు తరుణ్‌జోషి, విశ్వప్రసాద్‌లకు ఐపిఎం

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి కేంద్రం ప్రకటించే రాష్ట్రపతి పోలీసు పతకం (పిపిఎం). ఇండియన్ పోలీసు మెడల్ (ఐపిఎం) ఈసారి రాష్ట్రం నుంచి 14 మందికి దక్కాయి. ఇందులో ఇద్దరికి పిపిఎంలు రాగా 12 మందికి ఐపిఎంలు వచ్చాయి. రాష్ట్ర నిఘా విభాగం అధిపతి అనిల్‌కుమార్‌కు ప్రతిష్టాత్మకమైన పిపిఎం వచ్చింది. ఆయనతో పాటు 12వ బెటాలియన్ అదనపు కమాండంట్ బృ ంగి రామకృష్ణకు కూడా పిపిఎం వచ్చింది. కాగా ఐపిఎంలు వచ్చిన వారిలో రాష్ట్ర పోలీసు శిక్షణా విభాగం ఐజి డాక్టర్ తరుణ్ జోషి, హైదరాబాద్ స్పెషల్ బ్రాంచి జా యింట్ సిపి పేర్ల విశ్వప్రసాద్, సైబర్ క్రైం అసిస్టంట్ కమాండంట్ గంగసాని శ్రీధర్, ఇంటెలిజెన్స్ డిఎస్‌పి పూనాటి నరసింహారావు, ఆక్టోపస్ డిఎస్‌పి అరుణ్ రాజ్‌కుమా ర్, కరీంనగర్ స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, రాచకొండ ఐటి ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మూడవ బెటాలియన్ ఏఆర్‌ఎస్‌ఐ నారాయణ స్వామి. వరంగల్ నాలుగవ బెటాలియన్ ఆర్‌ఐ జయశీల, గ్రే హౌండ్స్ అసాల్ట్ కమాండర్ అచ్యుతరెడ్డి, ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ రాందేవ్ రెడ్డి, ఇక్కడేవున్న ఏఆర్‌ఎస్‌ఐ వీరాంజ నేయులు వున్నారు. కాగా పిపిఎంలు, ఐపిఎంలు వచ్చిన వారిని డిజిపి అభినందంచారు.



## వాసవీ గ్రూప్‌నకు ఇండియన్ ఎచీవర్స్ అవార్డు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త :** ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్, వాసవీ గ్రూప్‌కు ఇండియన్ ఎచ్చీవర్స్ అవార్డు లభించింది. ఢిల్లీలోని ఎన్‌డిఎంసి కన్వన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర రోడ్లు, రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్, నటుడు కృష్ణకపూర్ తదితురుల సమక్షంలో వాసవీ గ్రూప్ చైర్మన్ ఎర్రమ్ విజయకుమార్ ఈ అవార్డును స్వీకరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఎవై) పథకం కింద వాసవీ గ్రూప్ ఇటీవల హైదరాబాద్ బాచుపల్లి వద్ద పెద్దదైన వాసవీ అర్బన్ ప్రాజెక్టును చేపట్టి పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఇండియన్ అచ్చీవర్స్ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డు రావడంపై విజయకుమార్ స్పందిస్తూ వాసవీ గ్రూప్‌కు లభించిన గుర్తింపు ఇదన్నారు. వాసవీ ఖాతాదారులకు స్వంత గృహ కలలను నిజం చేయడంలో వాసవీ గ్రూప్ బాధ్యత, నిబద్ధతతో పనిచేసిందన్నారు.

## బిసి ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి ముహూర్తం ఖరారు

### వెనుకబడిన తరగతుల మంత్రి కమలాకర్

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** బిసి ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. కోకాపేట్, ఉప్పల్‌ల్లో 32 బిసి కులాలకు కేటాయించిన 87.3 ఎకరాల్లో నిర్మాణాలు ప్రారంభించనున్నారు. ఫిబ్రవరి 5న కోకాపేట్‌లో, 6న ఉప్పల్, పిర్జాదిగూడల్లో బిసి భవన నిర్మాణాలకు భూమి పూజ చేయనున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ మంత్రి జి కమలాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బిసి కులాల ఆత్మగౌరవం ప్రతిబింబించేలా చేపట్టనున్న ఈ భవనాల పనులు మార్చి నెలాఖరులోగా స్లాబులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే అనుమతి పొందిన ఏ బిసి కులమైనా ఈ గడువులోగా ముందుకు రాకపోతే తామే నిర్మాణాలను చేపడతామని చెప్పారు. ఏది ఏమైనా దసరాకు భవనాలను ప్రారంభించాలని స్పష్టం చేశారు. వీటి ప్రాంగణాల్లో రోడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు ఈ నెలాఖ రుకు పూర్తి చేయాలన్నారు. ఈ పనులు పూర్తి అయ్యేందుకు వివిధ శాఖల అధి కారులతో అడ్‌హాక్ కమిటీని నియమించాలని తెలిపారు. ఈ సమావేశంలో వెనుకబడిన తరగతుల శాఖ ముఖ్య కార్యదర్శి బి వెంకటేశ్వం తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు గోనె సంచుల లొల్లి

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త :** తమ పంటలను అమ్ముకునేందుకు రైతులు నానా కష్టాలు పడాల్సివస్తోంది. పంటను మార్కెట్‌లోకి తీసుకురాగానే వ్యాపారులు సిండికేటుగా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. చివరకు గన్నీ బ్యాకుల విషయంలోనూ రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో అతి పెద్దదైన వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులు రైతులను అరిగోస పెడుతున్నారు. గన్నీ బ్యాగ్‌ల విషయంలోనూ రైతులను వదలడం లేదు. రైతులకు ఒక సంచి 60 నుండి 80 రూపాయల వరకూ అమ్ముతున్న వ్యాపారులు, వాటిలో పంట నింపుకొచ్చాక అదే సంచికి 30 రూపాయలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే కాంటాలు, గొనుగోళ్లు నిలుపుదల చేసి, మార్కెట్ బంద్ సైతం చేసి రైతులను తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ అన్యాయంపై అధికారుల దృష్టికి పలువురు రైతులు తీసుకెళ్లినా వారిని పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

## రాష్ట్రంలో కరోనా తాజా కేసులు-4

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 25:** రాష్ట్రంలో కరోనా పాజిటీవ్ కేసులు బాగా తగ్గాయి. బుధవారం సాయంత్రం వరకు ఒక్క రోజులో 4 పాజిటీవ్ కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 8,41,484పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటలో కరోనా వల్ల మృతి చెందినట్లుగా నమోదు కాలేదు. రాష్ట్రంలో ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 4111 వరకు చేరింది. ఒక్క రోజులో 4428 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 3,83,79,799 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు కరోనా నుంచి 8,37,348మంది కోలుకోగా (99.51శాతం) బుధవారం ఒక్కరు కోలుకున్నారు. మొత్తం యాక్టీవ్ కేసుల సంఖ్య 25కు చేరింది. బుధవారం జిహెచ్‌ఎంసి పరిధిలో మూడు పాజిటీవ్ కేసులు నమో దు అయ్యాయి.

# పేదలపాలిట పెన్నిధి.. ఎన్టీఆర్ వంటివాళ్లు మళ్లీ పుట్టాలి

- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- నేత్రపర్వంగా ఎన్టీఆర్ శతజయంతి.. వేడుకగా పురస్కారాల ప్రదాపం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జనవరి 25, ప్రభాతవార్త :** నందమూరి తారక రామారావు పేదల పాలిట పెన్నిధి, ప్రేమావాత్సల్యాలున్న మహోన్నత వ్యక్తి అని, నేటితరాలకు, రాజకీయాలకు అలాంటి వాళ్ల మళ్లీ పుట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఎన్.టి.ఆర్ ఒక యుగపురుషుడని, సినీరంగంలోనే కాకుండా ప్రజాజీవితంలో కూడా అద్భుతాన్ని సృష్టించిన మహనీయుడని, మమ్మల్నందరినీ రాజకీయ రంగంలో నిల బెట్టాడని సగౌర్వంగా చెబుతున్నానని, నిజంగా దేవుని చూడక పోయినా దేవుడి రూపం ఆయన్లో కనిపించేదని అన్నారు. ఎన్టీఆర్ రాజకీయాల్లో కూడా గొప్ప పేరుప్రఖ్యాతులు గాంచారని, కొత్తపార్టీని పెట్టి 9మాసాల్లో అధికారంలో తీసుకొచ్చి దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తెలుగువాడి గొప్పదనాన్ని చాటిచెప్పిన మహోన్నతుడని కొనియాడారు. క్రమశిక్షణకు మారుపేరైన అజాతశత్రు, అందరితో కలిసి మెలిసివుండే, సేవాతత్పరుడు, ఎంపి ఎం.మురళీమోహన్‌కు ఎన్.టి. ఆర్ సిల్వర్‌క్రౌన్ అవార్డును, అలాగే జాతీయస్థాయిలో రెండుసార్లు ఎల్ఐ సిలో మొదటిస్థానంలో ఉన్న ప్రజా మార్గదర్శకుడు కౌటికె విఠల్‌కు చేసిన శ్రమకు ఫలితంగా ఎన్టీఆర్ శ్రమశక్తి అవార్డును అందించడం ఎంతో సబబుగా ఉందని వారి వారి సేవలను కొనియాడుతూ అభినందించారు. శృతి లయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వ విఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు శతజయంతి వేడుకల్లో భాగంగా రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సీల్‌వెల్ సినీ సుస్వరాలు శీర్షికన ఎన్.టి.ఆర్-మురళీమోహన్ నటించిన సినిమాల్లో ఆణిముత్యాల్లాంటి పాటలను ప్రముఖ నవరస గాయని, శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని నేత్రత్వంలో పలు ప్రముఖ వర్ధమాన గాయకులతో కలిసి ఆలపించి వీనులవిందు కావించడంతోపాటు ఎన్.టి.ఆర్ శతజయంతి పురస్కారాల ప్రదానోత్సవం సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుత్తా సుఖేందర్‌రెడ్డి, విశిష్ట అతిథులు సీల్‌వెల్ కార్పొరేషన్ సీఈఓ బండారు సుబ్బారావు, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, రేలంగి నరసింహారావు, రామకృష్ణ, కుసుమ భోగరాజు, ఎం.శివకుమార్, గాయని ఆమని తదితరులతో కలిసి పార్లమెంటు సభ్యుడు, జయభేరి సంస్థల అధినేత, ప్రముఖ నటుడు మురళీమోహన్‌కు ఎన్.టి.ఆర్ సిల్వర్‌క్రౌన్ పురస్కారం, ప్రజామార్గదర్శకుడు కౌటికె విఠల్‌ను ఎన్.టి.ఆర్ శ్రమశక్తి పురస్కారాలను ప్రదానంచేసి ఘనంగా సత్కరించారు. బండారు సుబ్బారావు స్వాగ తోపన్యాసంలో మురళీమోహన్ సేవాగుణం అసమాన్యమైందని, 10వేలమంది విద్యార్థులకు ఉన్నత విద్య ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులలో ఆయన ఆర్థిక సహాయంతో చదువు కొంటున్నారంటే అతని ధాతృత్వం అర్థమవుతుందని, నైతిక విలువలకు కట్టుబడివుంటూ రెండుసార్లు ఎంపిగా ప్రజలకు ఎంతగానో సేవలందించారని, ఆయనకు తాము ఎన్టీఆర్ సిల్వర్‌క్రౌన్ అవార్డు అందజేయడం సుకృతంగా భావిస్తున్నామని, అలాగే కౌటికె విఠల్ అకుంఠితదీక్ష, ప్రజాసేవకు గుర్తింపుగా ఎన్టీఆర్ శ్రమశక్తి అవార్డ్ ఇవ్వడం ఆనందంగా ఉందని ఇరువురినీ అభినందించారు.



ఎన్టీఆర్ పురస్కార గ్రహీతలు ఎం.మురళీమోహన్, కె.విఠల్‌లతో సుఖేందర్‌రెడ్డి, సుబ్బారావు, దామోదర్‌గుప్తా, దైవజ్ఞశర్మ, ఆమని తదితరులు

ఎం.మురళీమోహన్ తన స్పందనలో ఎన్టీఆర్ పేరున అవార్డు తీసుకోంటున్నందుకు ఆనందం, గర్వపడుతు న్నానని, పౌరాణిక ఆధ్యాత్మిక సామాజిక పాత్రల్లో ప్రపంచంలోనే ఆయనకు సాటెవ్వరూలేరని, బహు ప్రజ్ఞాశాలి అయిన ఎన్టీఆర్ సినీ రంగంలో కోట్లకు పడగెత్తినా రాజ కీయాల్లోకొచ్చి ప్రజాసేవచేయడం, ప్రతీ మనిషికి కడుపునిండడం, వంటినిండా బట్టలు కట్టుకోవడం ధ్యేయంగా రాజకీయాల్లో ఎన్నో పెనుమార్పులు తీసుకొచ్చారని, నిజానికి భారత దేశానికి 1947లో స్వాతంత్ర్యమొస్తే తెలంగాణకు మాత్రం ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో పటేల్ పట్వారీలను తీసివేసిన తర్వాతే స్వాతంత్ర్యమొచ్చిందని స్పష్టం చేశారు. చివరిగా సినిమాల్లో ఎన్.టి.ఆర్‌తో తన తత్సంబంధాలను, అనుభవాలను పంచుకొన్నారు. అనంతరం ఇతర అతిథులు ప్రసంగించారు. సభకుముందు, సభానంతరం ప్రఖ్యాత గాయని ఆమని నేతృత్వంలో వర్ధమాన గాయకులతో కలిసి ఎన్టీఆర్-మురళీమోహన్‌ల ఆణిముత్యాల్లాంటి సినీపాటలను సుమధురంగా పాడి అశేష ప్రేక్షకులను సంగీత లోకంలో విహారింపజేశారు.

# పంటల బీమా కోసం రూ.500 కోట్లు

### వ్యవసాయ శాఖ ప్రతిపాదన

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రకృతి వైపరీత్యాలు వంటి వాటి కారణంగా దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించేందుకు వీలుగా పంటల బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర సర్కార్‌కు వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. ఇందుకు అనుగుణంగా రానున్న కొత్త బడ్జెట్‌లో 500 కోట్ల రూపాయలను కూడా కేటాయించాలని సూచించింది. వచ్చే బడ్జెట్‌లో పంటల బీమా పథకాన్ని ప్రవేశ పెడితే రానున్న వానా కాలం పంటల సీజన్ నుండి అమలు చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు. కాగా వర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన పంటలకు పరిహారం అందక అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. రాష్ట్రంలో పంటల బీమా పథకాలను అమలు చేయకపోవడం రైతాంగానికి శాపంగా పరిణమించింది. రెండేళ్లుగా రాష్ట్రంలో ఎటువంటి పంటల బీమా పథకాలు కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని (పీఎంఎఫ్‌బీవై) రాష్ట్రంలో అమలు చేయడంలో వ్యవసాయ శాఖ తీవ్ర ఉదాసీన వైఖరి అవలంబిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా భారీ వర్షాలు, వరదలు తదితర ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల వంటి వాటితో పంటలు దెబ్బతినడంతో వాటికి పెట్టిన పెట్టుబడులను కోల్పోయి రైతాంగం ఆర్థిక నష్టాల ఊబిలో కూరుకుపోతోంది. దేశ వ్యాప్తంగా 2016-17 సంవత్సరం నుండి పీఎం ఫసల్ బీమా యోజన పథకం పేరుతో కేంద్రం వ్యవసాయ పంటలకు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద టెండర్ల ద్వారా ఖరారు చేసిన ప్రీమియం మొత్తంలో రైతులు వానాకాలం పంటలకు గరిష్టంగా 2 శాతం, యాసంగి పంటలకు 1.5 శాతం, వాణిజ్య, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియంను చెల్లించాల్సి ఉంటుంది.

మిగిలిన ప్రీమియం సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించాలి. ఈ పథకాన్ని 2020 సంవత్సరం నుండి కేంద్రం అమలు చేసే విషయంలో కేంద్రం స్వచ్ఛందం చేసి రాష్ట్రాలకే నిర్ణయాన్ని వదిలివేసింది. తుపాన్లు, వరదలు, అకాల వర్షాలు, వడగళ్ల వానలు, సహజంగా జరిగే అగ్ని ప్రమాదాలు, తెగుళ్ల వంటి వాటి వల్ల జరిగే పంట నష్టాలకు ఈ బీమా పరిహారం అందుతుంది. అయితే మూడేళ్లుగా ఈ పథకాన్ని అమలు చేసేందుకు తెలంగాణ వ్యవసాయ శాఖ ఆసక్తి చూప లేదు. ఇక ఆంధ్రప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, జార్ఖండ్ తదితర కొన్ని రాష్ట్రాలు ఈ పథకం స్థానంలో తమ సొంత పథకాలను ప్రారంభించి అమలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు కేవలం ఒక్క రూపాయి ప్రీమియంతోనే పంటల బీమాను అమలు చేస్తోంది. కానీ తెలంగాణలో మాత్రం కేంద్ర బీమా పథకాన్ని అమలు చేయకుండా, సొంత బీమా పథకాన్ని తీసుకురాక పోవడంతో పంటలు దెబ్బతిన్న రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఇంత వరకూ పట్టించుకునే వ్యవసాయ శాఖ ఇప్పుడు పంటల బీమాను తెరముందుకు తీసుకురావడం విశేషం.

**మూడేళ్లుగా రాష్ట్రంలో అమలు కాని పథకం**


**ప్రకృతి వైపరీత్యాలతో భారీగా నష్టపోతున్న రైతులు**

# గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాల నిర్వహణ తగదు

### రాజ్యాంగాన్ని, ప్రజలను అవమానించడమే

### రాచరికపు పోకడలకు ఇది పరాకాష్ట

### బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల



**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** దేశంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగం ఆమోదం పొందిన రోజు జనవరి 26 అని, కరోనా కారణంగా గణతంత్ర దినోత్సవం వేడు కలను నిర్వహించలేకపోతున్నామని, మీ రాజ్ భవన్‌లోనే నిర్వహించుకోవాలని సిఎం కెసిఆర్ లేఖ రాయడం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానించడమే బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం షామీర్‌పేటలో తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాలు నిర్వహించడం పద్దతి కాదన్నారు. ఇలా చేయడం రాజ్యాంగాన్ని, ప్రజలను అవమానపరచడే అన్నారు. మా హక్కులను కాలరాస్తూ, మమ్మల్ని అసెంబ్లీ నుంచి బయటకు గెంటివేస్తున్నారన్నారు. ఫిబ్రవరి 3 నుంచి జరిగే బడ్జెట్ సమావేశాలు కూడా గవర్నర్ ప్రసంగం లేకుండానే నిర్వహించాలని చూస్తున్నారని, ఇది రాచరికపు పోకడలకు పరాకాష్ట అన్నారు. ఒక్క రోజు ఆల్ పార్టీ మీటింగ్ పెట్ట లేదన్నారు. జాతీయ పార్టీ అయినా బిజెపిని కూడా ఐదుగురు సభ్యులు లేరని, ముగ్గురు సభ్యులే ఉన్నారంటూ బిఏసికి పిలువలేదన్నారు. గత ప్రభుత్వాలు ఒక్క ఎమ్మెల్యే ఉన్నా బిఏసికి పిలిచారన్నారు. పార్టీల మధ్య ఇనుప గోడలు పెట్టి, రాచరికపు పోకడలను అణువణువునా అమలు చేస్తున్నారన్నారు. పోలీసుల అధికార దుర్వినియోగంతో పోలీసులను వాడుకుంటూ ఎన్నికల్లో రూ.100 కోట్లు ఖర్చుచేస్తున్నారన్నారు. ఒక్క హుజు రాబాద్‌లోనే రూ.600కోట్లు ఖర్చు చేశారని, మనుగోడులో రూ.100కోట్లు ఖర్చు ఖర్చుచేశారు. పోలీసులు సైతం కెసిఆర్‌కు కొమ్ముకాస్తున్నారన్నారు. పోలీసుల వలయంలోనే డబ్బులు పంచుతున్నారన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ పెట్టి, ప్రజలకు ఏం చెప్పదలుచుకున్నారని ప్రశ్నించారు. ధరణి పేరుతో పేదల భూములను లాక్కుని దండుకుంటున్నారనాన్నరు. ఇవాళ పైసలు లేకపోతే ఎన్నికలు లేవన్నారు. 20 సంవత్సరాల తన రాజకీయ జీవితంలో ఇలాంటి రాజకీయ పరిస్థితులను నేను ఎప్పుడూ చూడలేదన్నారు.

తెలంగాణలోని దుర్నీతి, చిల్లర సంప్రదాయాన్ని దేశంలో రుద్దడంకోసంమే బిఆర్‌ఎస్ పార్టీ అన్నారు. డబ్బులు పెట్టి ఖమ్మంలో సభ పెట్టుకున్నారన్నారు. కెసిఆర్ బిహార్, యూపి, తమిళనాడులో ఖర్చు పెట్టే ఖర్చులు కెసిఆర్‌వి కావని, ప్రజల నుంచి దోచుకున్నవన్నారు. వ్యవసాయానికి 24గంటలు ఎక్కడా కరెంటు ఇవ్వడంలేదన్నారు. ఏసిడి పేరుతో విద్యుత్ బిల్లులో కూడా అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. దళితబంధు, దళితులకు మూడు ఎరాలు లేవు అన్నారు. కాళేశ్వరం వద్ద నిష్ణాతులైన ఇంజనీర్లు అడుగుపెట్టే పరిస్థితి లేదన్నారు. హైదరాబాద్‌లో కొల్లగొడుతున్న భూముల అన్నింటిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ రాజ్యంలో డబ్బులు లేకుండా ఎన్నికలు లేవన్నారు. కెసిఆర్ మనుషులు అన్ని పార్టీలో ఉన్నారని అన్నారు.

తెలంగాణపై మోడి, అమిత్ షా, నడ్డాలు ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా మా కార్యాచరణ ఉంటుందన్నారు. ఇంటలిజెన్స్ వ్యవస్థ అంతా ఈటల రాజేందర్ ఏం చేస్తున్నాడా? ఎవరిని కలుస్తున్నారు అనేది చూస్తుందన్నారు. తాను హుజురాబాద్‌లో గెలిచి 13 నెలలు అవుతున్నా ఒక్క అధికారిక కార్యక్రమానికి ఆహ్వానం లేదన్నారు. ఈ ఎకిలి, మకిలి చేష్టలు ఎన్ని రోజులో ఉండవన్నారు.

